దేవికుంటెలో గ్రామస్థుల నిరసన

బాగేపల్లి, ఏప్రిల్ 26: పోలింగ్ వేళ గ్రామస్థులు నిరసనకు దిగారు బాగేపల్లి తాలూకా గూళూరు హోబళి దేవికుంటె గ్రామంలో సరైన రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపిస్తూ పోలింగ్‌ను బహిష్కరిస్తూ నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్నారు. జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి భాస్కర్, తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌వర్ణి, తాలూకా పంచాయతీకి చేరుకున్నారు. ప్రజలంతా పొలిమేరలోనే గుమిగూడి ఉన్నారు. తహసీల్దార్ జోక్యంతో ప్రజలు మధ్యాహ్నం ఓటింగ్ ప్రారంభమయ్యింది.







బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్

ఓటు వేసిన అనంతరం మీడియాకు ఇంకు గుర్తును చూపుతున్న సీఎం సిద్ధరామయ్య

ఓటు వేసిన డీసీఎం డీకే శివకుమార్, డీకే సురేశ్, రాజీవ్‌గౌడ, ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, బెంగళూరు దక్షిణ బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్య, ఎమ్మెల్యే రవి సుబ్రమణ్య



సినీ నటుడు రమేశ్ అరవింద్

తొలి విడత పోలింగ్
ప్రశాంతం

- 69.23 శాతం పోలింగ్ నమోదు
- నగరాల్లో మందకొడిగా ఓటింగ్
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రముఖులు
- ఈవీఎంల్లో నేతల భవితవ్యం



నగరంలోని సోమేశ్వరనగర్‌లో ఓటేసిన 105 ఏదేళ్ల వృద్ధురాలు రాజమ్మ

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల తర్వాత కూడా బెంగళూరు, మైసూరు, మంగళూరుతోపాటు పలు చోట్ల ఓటర్లు క్యూలో వేచియున్నారు. చామరాజనగరలో ఓ పోలింగ్ కేంద్రం ధ్వంసం , నాలుగైదు చోట్ల తోపులాటలు మినహా మిగతాదంతా ప్రశాంతంగానే పోలింగ్ ముగిసింది. తొలివిడత 14 స్థానాలలో బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు గ్రామీణ, తుమకూరు, చిక్కబళ్ళాపుర, కోలారు, మండ్య, మైసూరు, చామరాజనగర, చిత్రదుర్గ, హాసన్, ఉడుపి-చిక్కమగళూరు, దక్షిణకన్నడలో పోలింగ్ జరిగింది. 247మంది అభ్యర్థులు ఉండగా 2.88 కోట్లమంది ఓటర్లు ఉన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా దాదాపు 10 గంటలకు మంగళూరు మినహా అన్ని చోట్లా 20శాతానికి అటుఇటుగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 1-2 గంటల మధ్యన దాదాపు పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు లేక నిలిచిపోయిన పరిస్థితి కనిపించింది. చిక్కబళ్లాపురలోని 161 పోలింగ్‌బూత్‌లో బాదాం కుటుంబానికి చెందిన 90మంది ఓటు వేశారు. దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా బాంజారు పోలింగ్ కేంద్రంలో 100శాతం పోలింగ్ సాధ్యమైంది. చార్మాడిఘాట్ ప్రాంతంలో ఉండే ఈ గ్రామంలో 111మంది ఓటర్లు ఉండగా అందరూ హక్కు వినియోగించుకున్నారు.

హనూరులో ఈవీఎం ధ్వంసం

చామరాజనగర జిల్లా హనూరు తాలూకా ఇండగనత్తహళ్ళి పరిధిలోని నాలుగు పల్లెల్లో ప్రజలు పోలింగ్‌ను బహిష్కరించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు తీర్చలేదని వారు ఆందోళనకు దిగారు. తహశీల్దార్ గురుప్రసాద్ నేతృత్వంలో అధికారులు చర్చలకు వెళ్లారు. గ్రామస్థులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ పరిణామంతో రెచ్చిపోయిన ఓటర్లు పోలింగ్ కేంద్రంపై దాడి చేశారు. ఈవీఎంను ధ్వంసం చేశారు. పోలీసులు లాఠీచార్జీ చేయగా ప్రజలు రాళ్లు రువ్వారు. పెద్ద ఎత్తున పోలీసుబలగాలు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా చిక్కబళ్ళాపుర జిల్లా బాగేపల్లి తాలూకా దేవికుంటె గ్రామంలో రోడ్డు వేయలేదని గ్రామస్తులు ఆందోళన చేశారు. దక్షిణకన్నడ జిల్లా గొల్లహళ్ళి తండాలో 200మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేయకుండా బహిష్కరించారు. రంగంలోకి దిగిన అధికారులు సమస్యను పరిష్కరించారు. మంగళూరు కపితానియో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులపై దాడికి కార్యకర్తలు ప్రయత్నించడంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు.

ఓటేసిన ప్రముఖులు

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలలో ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారు. సీఎం సిద్ధరామయ్య కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం సిద్ధరామనహుండిలో పాల్గొన్నారు. డీసీఎం డీకే శివకుమార్ కనకపురలోని దొడ్డఆలహళ్ళి గ్రామంలో ఓటు వేశారు. డీకే శివకుమార్ భార్య, ఉషా కుమార్తె ఐశ్వర్య, బెంగళూరు గ్రామీణ అభ్యర్థి డీకే సురేశ్ కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు.

ఓటు వేసిన అభ్యర్థులు

బెంగళూరు దక్షిణ బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్య బసవనగుడిలో ఓటు వినియోగించుకున్నారు. చిన్నాన్న, ఎమ్మెల్యే రవిసుబ్రమణ్యా కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి, తండ్రి మంత్రి రామలింగారెడ్డితో కలసి ఓటు వేశారు. బెంగళూరు సెంట్రల్ బీజేపీ అభ్యర్థి పీసీ మోహన్ కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. బెంగళూరు ఉత్తర బీజేపీ అభ్యర్థి శోభాకరంద్లాజె నాగశెట్టిహళ్ళి పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్‌గౌడ కుటుంబీకులతో కలసి ఓటు వేశారు. బెంగళూరు సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్‌ఖాన్, తండ్రి రెహమాన్‌ఖాన్‌తో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. మండ్య జేడీఎస్ అభ్యర్థి కుమారస్వామి, భార్య అనితా, కుమారుడు నిఖిల్, భార్య రేవతిలో కలసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండ్యలో కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణేగౌడ ఓటు వేశారు. చిక్కబళ్ళాపుర బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ సొంతూరు పెరేసంద్రలో కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్య, తండ్రి ఎమ్మెల్సీ సీతారాం కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. కోలారు అభ్యర్థులు మల్లేశ్‌బాబు, గౌతమ్‌లు ఓటు వేశారు. మైసూరు బీజేపీ అభ్యర్థి యదువీర్ కుటుంబీకులతో కలసి చాముండేశ్వరిదేవికి పూజలు జరిపి అనంతరం ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎం లక్ష్మణ్ మైసూరులో ఓటు వేశారు. ఉడుపి-చిక్కమగళూరు బీజేపీ అభ్యర్థి కోట శ్రీనివాసపూజారి సొంతూరు దక్షిణకన్నడ జిల్లాలో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జయప్రకాశ్‌హెగ్డే కుటుంబీకులతో కలసి ఓటు వేశారు. దక్షిణకన్నడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మరాజ్ ఆర్ పూజారి కుటుంబీకులతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి కేప్టెన్ బ్రిజేశ్‌చౌట ఓటు వేశారు. చిత్రదుర్గ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప ఓటు వినియోగించుకున్నారు. తుమకూరు కాంగ్రెస్ అభ్యర్థి ముద్దహనుమేగౌడ తుమకూరులోనూ, బీజేపీ అభ్యర్థి సోమణ్ణ బెంగళూరు గోవిందరాజనగర్‌లో ఓటు వేశారు.



మండ్య అభ్యర్థి కుమారస్వామి దంపతులు

తరలివచ్చిన ప్రముఖులు

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తిలు జయనగర్‌లో ఓటు వేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జయనగర్ బీఈఎస్ కళాశాలలో ఓటువేశారు. రాష్ట్ర ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ మీనా కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. యువత ఓటు వేసేందుకు రావాలని రాహుల్ ద్రావిడ్ పిలుపునిచ్చారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు ప్రజలు పోలింగ్ కేంద్రాలకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే ఓటు వేశారు. క్రికెటర్ అనిల్‌కుంబ్లె



సీవీరామన్ నగర్‌లో బారులు తీరిన ఓటర్లు

గుర్రంపై వచ్చి ఓటేసిన డాక్టర్

తుమకూరు జిల్లా తిపటూరుకు చెందిన వెటర్నరీ డాక్టర్ శ్రీధర్ గుర్రంపై వచ్చి ఓటు వేశారు. సత్యకుమార్ ఫౌండేషన్ ద్వారా సమాజసేవ చేస్తున్న అతను ఓటర్లకు సమోసా, టీ కూడా ఏర్పాటు చేశారు. చిక్కమగళూరు నగరంలో 80ఏళ్ల కణ్ణమ్మ తెల్లవారు 5.30 గంటలకే ఓటు వేసేందుకు వచ్చారు. ఆకు కూరలు ఆమె ఓటు ముగించుకుని వ్యాపారం కోసం వెళ్లిపోయారు.

ఓటు వేసిన స్వామీజీలు

పోలింగ్ జరిగిన ప్రాంతాల్లో వివిధ మఠాధిపతులు, స్వామీజీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తుమకూరు సిద్ధగంగామఠాధిపతి సిద్ధలింగస్వామిజీ, రంభాపురి స్వామిజీలు ఓటు వేశారు. చిత్రదుర్గలోని కురబరహట్టి పోలింగ్ కేంద్రంలో బసవమూర్తి మాదార చెన్నయ్యస్వామీజీ, ఇమ్మడి సిద్ధరామేశ్వరస్వామీజీతోపాటు మరో ఐదారుమంది స్వామీజీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉడుపి పెజావర పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థస్వామీజీ ఓటు వేశారు. అదమారు మఠాధిపతి ఉదయమే ఓటు వేశారు. అయితే బీప్‌సౌండ్ రాలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోసారి కేంద్రానికి వచ్చారు. ఇదే విషయమై స్వామీజీ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం చేశారని అందుకే రెండోసారి పోలింగ్ కేంద్రానికి వచ్చానన్నారు. కాగా బెంగళూరు గ్రామీణ పరిధిలో గిఫ్ట్‌కార్డులు పంచుతున్నారని ఎన్నికలు పారదర్శకంగా జరగడం లేదని ఎన్నికల కమిషన్ విఫలమైందని మండ్య అభ్యర్థి కుమారస్వామి మండిపడ్డారు. రాష్ట్రమంతటా ఎన్నికలు ప్రశాంతంగానే జరిగాయని అధికారులు అభిప్రాయపడ్డారు. మధ్యాహ్నం మండుటెండలోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.



తొలిసారి ఓటు వేసిన ఆనందం సెల్ఫీతో పంచుకుంటున్న యువత

తరలివచ్చిన తారలు

లోక్‌సభ ఎన్నికలకు జరిగిన పోలింగ్‌లో పలువురు నటులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గోల్డెన్‌స్టార్ గణేశ్, శిల్పా దంపతులు ఉదయమే ఆర్‌ఆర్‌నగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నటి అమూల్య విజయనగర్‌లో కుటుంబీకులతో కలసి ఓటు వేశారు. రవిచంద్రన్, ప్రేమ, రాగిణి ద్వివేది, దునియా విజయ్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. యశ్, సుదీప్, రమేశ్ అరవింద్, దర్శన్, రచితారామ్, ధ్రువసర్జా, రక్షిత్‌శెట్టి, డాలి ధనంజయ్‌లు కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. యశ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నటుడు సుదీప్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి వ్యక్తి బాధ్యత అన్నారు.

ద్వేషానికి వ్యతిరేకంగా ఓటు వేశా : ప్రకాశ్‌రాజ్



ద్వేషానికి వ్యతిరేకంగా ఓటు వేశానని నటుడు ప్రకాశ్‌రాజ్ తెలిపారు. బెంగళూరులో శుక్రవారం ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఆయన సోషల్‌మీడియా ద్వారా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాను దేశాన్ని విభజించేవారికి వ్యతిరేకంగా ఓటు వేశానన్నారు. నా హక్కు నేను వినియోగించుకున్నాను, నాకు మద్దతు ఇవ్వాలనిపించివారికి ఓటు వేశారు. పార్లమెంటులో మన ధ్వని వినిపించాలనుకునే వారికి మనం ఎన్నుకోవాలి. ఉత్తమ అభ్యర్థిని ఎంపిక చేసుకోవడం ముఖ్యం. ఉత్తమ అభ్యర్థి, ఉత్తమ ప్రణాళిక, మార్పుకు ఓటు వేశాను. గడిచిన దశాబ్దంలో ద్వేషం, విభజన రాజకీయాలను చూశాను. తన నియోజకవర్గంలో ఉత్తమ అభ్యర్థికి ఓటు వేశాను. బెంగళూరులో అందరూ ఓటు వేయండి. ఓటుకు దూరంగా ఉండరాదు. పార్లమెంటుకు మనకోసం మాట్లాడేవారిని పంపుదామన్నారు.

తొలి విడత పోలింగ్ సరళి ఇలా...

14లోక్‌సభ స్థానాలకు శుక్రవారం జరిగిన పోలింగ్ సరళి ఇలా. ముగింపు సమయానికి అందిన సమాచారం ఇలా. సగటున 69.23 శాతం పోలింగ్ నమోదైంది.

నియోజకవర్గం	9గం.	11గం.	1గం.	3గం.	5గం.	ముగింపు వేళకు
ఉడుపి- చిక్కమగళూరు	12.82	29.03	46.43	57.49	72.13	76.06
హాసన్	8.23	22.03	40.99	55.92	72.13	77.51
దక్షిణకన్నడ	14.33	30.98	48.10	58.76	71.83	77.43
చిత్రదుర్గ	7.73	21.75	31.05	52.14	67.00	73.11
తుమకూరు	9.57	23.32	41.91	56.62	72.10	77.70
మండ్య	7.70	21.24	40.70	57.44	74.87	81.48
మైసూరు	11.01	25.09	41.58	53.55	65.85	70.45
చామరాజనగర	7.70	22.81	39.57	54.82	69.60	76.59
బెంగళూరు గ్రామీణ	8.39	20.35	36.09	49.62	61.78	67.29
బెంగళూరు ఉత్తర	8.64	19.78	32.25	41.12	50.04	54.42
బెంగళూరు సెంట్రల్	8.14	19.21	30.10	40.10	48.61	52.81
బెంగళూరు దక్షిణ	9.08	19.81	31.51	40.77	49.37	53.15
చిక్కబళ్ళాపుర	8.74	21.92	39.85	55.90	70.97	76.82
కోలారు	8.30	20.76	38.42	54.66	71.26	78.07

త్వరలో మోదీ కన్నీరు

- ఆయనకు ఓటమి భయం పట్టుకుంది
- దేశ సంపదను కొందరు కార్పొరేట్ కంపెనీలకు పంచిపెట్టిన ఘనుడు
- విజయపుర సభలో రాహుల్ ఎద్దేవా



విజయపురసభలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ త్వరలోనే ఎన్నికల ప్రచార వేదికపై కన్నీరు పెడతారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. శుక్రవారం విజయపుర(బీజాపూర్)లో ఎన్నికల ప్రచారసభలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ దేశ సమస్యలపై ప్రధాని మోదీ మాట్లాడడం లేదని, అనవసరమైన అంశాలను తెరపైకి తెస్తున్నారన్నారు. మంగళసూత్రం, ఆస్తి పంపిణీ అంశాలను మాట్లాడుతున్నారన్నారు. మీరంతా ప్రధాని మోదీ ప్రసంగాలు విన్నారా..? ఆయనకు భయం పట్టుకుంది. మీ ఆలోచనలు మార్చేలా మాట్లాడతారు..? మీరు ఇటీవల ఆయన ప్రసంగాలు వింటే అర్థమవుతుంది. ఒకరోజు పాకిస్థాన్ గురించి మాట్లాడతారు, మరో రోజు ప్లేట్ కొట్టాలంటారు, మరో రోజు మొబైల్ టార్చ్ అంటారంటూ ఎద్దేవా చేశారు. మనమంతా భారతీయులం, దేశంలో ప్రజలు ఎదుర్కొనే అంశాలు ఎందుకు మాట్లాడరనేది ఆలోచించాలి. నిరుద్యోగం, నిత్యావసర ధరల పెంపు వంటి అంశాలపై ప్రధాని మాట్లాడరన్నారు. తొలి విడత ఎన్నికల తర్వాత ప్రధాని మోదీలో భయం పట్టుకుందన్నారు. పదేళ్లలో మోదీ కొందరు పారిశ్రామికవేత్తలను శ్రీమంతులను చేశారని ఆరోపించారు. దేశ సంపదలో 40శాతం వారు నియంత్రిస్తున్నారని మండిపడ్డారు. దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలకు అవకాశాలు లభించడం లేదన్నారు.

- సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో రోజుకో అంశంతో దారి తప్పిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలో 15, 16 కాలంలో సామాజికంగా విద్యాపరంగా బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని స్పష్టంగా ఉందన్నారు. అందులో బీసీలు, ముస్లింలు, క్రిస్టియన్‌లు అందరూ ఉంటారన్నారు. కేవలం ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్‌లు ఇవ్వడం లేదని చెప్పలేమన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడుతున్నారని, ఓ ప్రధాని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 1977లో హావనూరు కమిషన్ మైనారిటీలకు రిజర్వేషన్ ఇవ్వాలని సిఫారసు చేసిందని, చిన్నప్పరెడ్డి కమిషన్ కూడా ఇదే సిఫారసు చేసిందన్నారు. 2004లో కర్ణాటకలో ముస్లింలకు 2బీ కోటాలో 4శాతం రిజర్వేషన్ ప్రారంభించామన్నారు. కానీ ఎన్నికలవేళ తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. 2047 వికసిత భారత్ అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు.

బీజేపీ చెంబు పార్టీ

- బళ్లారిలో రాహుల్ ఎద్దేవా

బళ్లారి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఖాళీ చెంబు పార్టీ అని, కర్ణాటకు మాటలు తప్ప చేసిందేమీ లేదని రాహుల్ గాంధీ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం బళ్లారిలోని మున్సిపల్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించింది. కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బీజేపీ దేశ సంపదను వారికి అనుకూలంగా ఉండే 22 మంది సంపన్నులకు పంచిపెట్టి, పేదలకు మొండి చేయి మిగిల్చిందన్నారు. కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొందన్నారు. ప్రతి పేదవారిని లక్షాధికారులు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటికీ ఏడాదికి రూ.లక్ష అందజేస్తామన్నారు. కర్ణాటక పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఉండే రైతుల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కర్ణాటక ప్రభుత్వం గృహలక్ష్మీ ద్వారా నెలకు రూ. రెండు వేలు అంటే ఏడాదికి రూ. 24 వేలు వీటికి అదనంగా కేంద్ర ప్రభుత్వం రూ. 8500 మహిళల ఖాతాకు జమ చేస్తామని రాహుల్ పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర ప్రకటిస్తామన్నారు. పేదలకు భారమైన జీఎస్టీని తొలగించి సామాన్య జీఎస్టీని ప్రవేశ పెడతామన్నారు. మరోసారి బళ్లారిలో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. బళ్లారి జీన్స్ పరిశ్రమకు చేయూతనిచ్చి దేశంలోనే తలమానికంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మంత్రులు నాగేంద్ర, జమీర్ అమ్మద్, సంతోష్ లాడ్, ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, గణేష్, శ్రీనివాసులు, లత, నాగరాజు, సీనియర్ నాయకులు టీకే హరిప్రసాద్, మాజీఎంపీ ఉగ్రప్ప, మాజీ ఎమ్మెల్సీ అల్లం వీరభద్రప్ప, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్పొరేటర్లు, గుమ్మనూరు జగన్, అయాజ్, విక్కీ, వివేక్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బళ్లారిలో చెంబు చూపుతూ..

ప్రచారానికి ఎవరూ పిలవలేదు

- మండ్య ఎంపీ సుమలత
- స్వయంగా ఆహ్వానించా: కుమార స్వామి



బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నుంచి హాట్‌హాట్‌గా రాజకీయం సాగినట్లుగానే మండ్య రాజకీయం పోలింగ్ రోజున కూడా కొనసాగింది. మండ్య జిల్లా మద్దూరు తాలూకా దొడ్డఅరిసనకెరెలో ఓటు వేసేందుకు వెళ్ళిన ఎంపీ సుమలత మీడియాతో మాట్లాడుతూ తనను ఎవరూ మండ్యలో ప్రచారానికి పిలవలేదని తాను ఎలా వస్తానన్నారు. కానీ దేవెగౌడ వ్యాఖ్యలు బాధకలిగించాయన్నారు. ఓడిన నియోజకవర్గాన్ని ఎవరూ వదులుకోరని అటువంటిది గెలిచిన స్థానాన్ని తాగ్యం చేయడం తప్పు చేసినట్లా అని ప్రశ్నించారు. ఇండిపెండెంట్ ఎంపీగా నా బాధ్యత నిర్వహించాను. నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలన్న ఉద్దేశంతోనే సిట్టింగ్ స్థానాన్ని వదులుకున్నట్లు స్పష్టం చేశారు. తాను నిష్పక్షపాతంగా వ్యవహరించానని అంబరీష్ అభిమానుల శక్తిని ఎన్‌డీఏకు కల్పించామన్నారు. సుమలతా ఎన్నికలలో సహకరించలేదన్న దేవెగౌడ వ్యాఖ్యలు బాధ కలిగించాయన్నారు. జేడీఎస్ నాయకులు ఎవరూ ఏ సభకు ఆహ్వానించలేదన్నారు. వారు ఆహ్వానించినా వెళ్ళకుంటే తప్పు అవుతుందన్నారు. తాను లేకుండానే ఎన్నికలు చేసుకుంటామనే భావన వారిలో ఉండవచ్చునంటూ ఎద్దేవా చేశారు. కుమారస్వామి తన ఇంటికి వచ్చి వెళ్ళిన తర్వాత ఒక్కసారి కూడా ఫోన్ చేసి ప్రచారానికి పిలువలేదన్నారు. సీటునే వదులుకున్న తాను ప్రచారానికి వెళ్ళకుండా ఉంటానా అన్నారు. నేను నియోజకవర్గాన్ని వదులుకోవడమే చేసిన తప్పా అంటూ ప్రశ్నించారు.

కలసి పనిచేద్దామన్నాను..

సుమలతకు ప్రచారం కోసం స్వయంగా తానే ఆహ్వానించానని బీజేపీ- జేడీఎస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కుమారస్వామి వెల్లడించారు. పోలింగ్ రోజున సుమలత వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. సుమలత ఇంటికి వెళ్ళానన్నారు. అదేరోజున మండ్య ఎన్నికలలో కలిసి పనిచేద్దామని కోరానన్నారు. టికెట్ నాకు దక్కిందనే సమాచారం మాత్రమే తెలిపేందుకు వెళ్ళలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మైసూరు సభకు సుమలత వచ్చారని అక్కడా మాట్లాడి రెండు రోజులు ప్రచారానికి రావాలని కోరానన్నారు. మండ్యలో అంబరీష్ అభిమానులు కలిసికట్టుగా పనిచేశారు. సుమలత కూడా వచ్చి తనకే ఓటువేశారు. ఇంతకంటే తనకు మద్దతు ఏం కావాలన్నారు. బీజేపీ నాయకులంతా మండ్యలో ప్రచారం చేశారన్నారు. సుమలత బీజేపీ ఎక్కడ ప్రచారం చేయమంటే అక్కడ చేస్తామని తెలిపారన్నారు. మండ్యలో చివరకు కాంగ్రెస్ వర్గీయులు కూడా అంతర్గతంగా తనకు మద్దతు ఇచ్చారన్నారు.

ఓటు వేసేందుకు విదేశాల నుంచి వచ్చారు..

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తొలి విడత సమరం ప్రశాతంగా ముగిసింది. అయితే పలు చోట్ల పలు విశేషాలు ఈ సారి పోలింగ్‌లో చోటు చేసుకున్నాయి. ఓటు వజ్రాయుధం లాంటిది ఓటు హక్కు. వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని శక్తివంతం చేయవచ్చు అంటూ విస్తృతంగా చైతన్యం కలిగించినా కొందరు వెనుకంజ వేస్తుంటారు. అటువంటిది విదేశాల నుంచి వచ్చి ఓటు వినియోగించుకునేవారు ఎందరికో స్ఫూర్తినిచ్చినట్లే. ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని ఓటు వేసేందుకే చిత్రదుర్గకు వచ్చారు. ఆదేశంలో విద్యాసంస్థలకు సెలవులు ఉన్నందున తొలి ఓటు వేయవచ్చునని భావించిన లిఖితా మంగళవారం బెంగళూరుకు చేరుకున్నారు. రెండురోజులుగా మంచి అభ్యర్థి ఎవరనేది తెలుసుకుని శుక్రవారం టీచర్స్ కాలనీకి అనుబంధంగా ఉండే పోలింగ్ బూత్‌లో తల్లిదండ్రులతో కలిసి ఓటు వేశారు. ఇదే సందర్భంగా మాట్లాడుతూ ఫిలిప్పైన్స్ నుంచి వచ్చానని ఓటు వేయడం సంతోషంగా ఉందన్నారు. తొలి ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని ఆనందంగా భావిస్తున్నట్లు తెలిపారు.

● దక్షిణకన్నడ జిల్లా పుత్తూరుకు చెందిన అబ్దుల్ లతీఫ్ దుబైలో ఉద్యోగం చేస్తున్నారు. ఓటు వేసేందుకే స్వదేశం వచ్చారు. శుక్రవారం మంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయన నేరుగా పుత్తూరు మురప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. గత ఏడాది శాసనసభ ఎన్నికలలోను దుబై నుంచి వచ్చి లతీఫ్ ఓటు వేశారు.

దుబాయ్ నుంచి కోలారుకు

● కోలారుకు చెందిన సయ్యద్ వ్యాపారనిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో దిగి నేరుగా కోలారుకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇదే విషయాన్ని సయ్యద్ మీడియాకు తెలిపారు.


తల్లిదండ్రులతో మెడికో లిఖితా


ఒకేసారి 85మంది ఓటు వేసినట్లు వేలు చూపుతున్న బాదామ్ కుటుంబ సభ్యులు..

కుటుంబమంతా..

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 26: చిక్కబళ్లాపురకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 85మంది ఒకే సారి ఓటు హక్కును వినియోగించుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. చిక్కబళ్లాపుర నగరంలోని బాదామ్ కుటుంబ సభ్యులు ఎన్నికలు జరిగిన ప్రతి సారి ఓటు హక్కుకు కుటుంబ సమేతంగా ఒకేసారి ఓటు హక్కును వినియోగించు కుంటున్నట్లు, అదే రీతిలో శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒకే సారి... ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడం గమనార్హం. నిత్యం పనుల్లో బిజీగా ఉంటున్న ఈ కుటుంబ సభ్యులు ఎన్నికల సమయంలో ఒకచోటకు చేరుకుని ఓటువేయడం ఆ కుటుంబం ప్రత్యేకత. నగరంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 85మంది బాదామ్ కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సమయంలోనైనా... ఒకచోట చేరి ఉమ్మడి కుటుంబంలో ఉన్న ఆనందాన్ని తెలిపే ప్రయత్నం చేస్తున్న బాదామ్ కుటుంబ సభ్యులు శ్లాఘనీయం...

శ్రీరస్తు.. శుభమస్తు.. బాధ్యతమస్తు..

● పెళ్ళి దుస్తులతోనే... పోలింగ్ కేంద్రానికి..
● ఓటు ప్రాధాన్యం తెలిపి ఆదర్శంగా నిలిచారు..

ఓటు హక్కు ప్రాధాన్యం తెలుసుకున్న ఓ పెళ్ళిజంట ఏకంగా పెళ్ళి పీటల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిత్రదుర్గ జిల్లా పరిధిలోని విజాపుర గ్రామంలోని నవదంపతులు శుక్రవారం మాంగళ్యధారణ జరిగిన తక్షణమే విజాపుర గ్రామానికి చెందిన నవదంపతులు అరుణ్-కావ్యలు గ్రామంలోని పోలింగ్ బూత్ నెంబర్ 13కు పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఓటు వేసి, ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. **- బళ్లారి గాంధీనగర్**



విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో గిరిజాశంకర కల్యాణమండపంలో వివాహం అనంతరం నవ వధువు ఓటు వేసింది. శ్రీనివాస్, నాగమణి దంపతుల కుమార్తె తేజస్విని శశాంక్ పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో ఓటు వేశారు. కాగా పెళ్లైన తర్వాత బాధ్యతగా వధువు తన ఓటు




ఓటు వేసిన ప్రతిపక్షనేత ఆర్ అశోక్


మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ


ఎమ్మెల్యే కృష్ణప్ప, ఎమ్మెల్యే ప్రియాకృష్ణ


మంత్రి రామలింగారెడ్డి, కుమార్తె అభ్యర్థి సౌమ్యారెడ్డి


కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ అలిఖాన్


ఓటు వేసిన బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్


మహలక్ష్మి లే అవుట్‌లో ఇస్కాన్ ప్రముఖులు


సీవీ రామన్‌నగర్‌లో వృద్ధురాలికి చేయూత


తలఘట్టపురలో గుర్తింపుకార్డులతో ఓటర్లు


సోమేశ్వరనగర్‌లో బారులు ముస్లిం మహిళలు

42మంది ఓటర్లకోసం 15మంది సిబ్బంది ..120 కిలోమీటర్లు



విరాజ్‌పేట ముగ్రూట్‌కు బయల్దేరిన ఎన్నికల సిబ్బంది

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సమరంలో ప్రతి ఓటు కీలకంగా ఎన్నికల కమిషన్ భావించింది. 42మంది ఓటర్లకోసం 15మంది సిబ్బంది 120 కిలోమీటర్లు ప్రయాణించి ముగ్రూట్‌కు చేరుకున్నారు. కాగా కడమకళ్లలో 180 ఓట్లకోసం 30మంది సిబ్బంది 95 కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ రెండు పోలింగ్‌బూత్‌లు కొడగు జిల్లా మడికేరి తాలూకాకు చెందినవి. విరాజ్‌పేట శాసనసభ నియోజకవర్గం ముగ్రూట్‌కు 8-10కిలోమీటర్ల దూరం ఉంది. అయితే ముగ్రూట్‌కు వెళ్లేందుకు కేరళమీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. కేరళ రాష్ట్రంలోని పాణత్తూరు, కొయిచాల్, మాళం, చిత్తారికల్, పాలంబైల్ ద్వారా చేరుకోవాల్సి ఉంటుంది. భాగమండల గ్రామపంచాయతీ ముగ్రూట్ గ్రామస్థులు పంచాయతీ కేంద్రానికి రావాలంటే 88 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఇక్కడ అటవీ అధికారి కార్యాలయంలో పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లాలంటే కేవలం జీప్‌ల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ముగ్రూట్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి గురువారం ఉదయమే 15మంది సిబ్బంది ప్రత్యేక జీప్‌ల ద్వారా వెళ్లారు. ఇక దక్షిణకన్నడ జిల్లా సరిహద్దులోని కడమకల్ పోలింగ్ కేంద్రానికి 95 కిలోమీటర్లు ప్రయాణించారు. ఒకప్పుడు నక్సల్స్ కేంద్రంగా ఉండేది. ఇటీవల రెండు నెలలకాలంలో పలుమార్లు నక్సల్స్ కడమకల్ ప్రాంతానికి వచ్చినట్లు ప్రచారం ఉన్న నేపథ్యంలో భారీ బందోబస్తుతో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నక్సల్స్ నిరోధకదళంతోపాటు పారామిలిటరీ స్థానిక పోలీసులు ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్ మడికేరి తాలూకా విద్యాశాఖాధికారి దొడ్డగౌడ మాట్లాడుతూ మడికేరి నుంచి కడమకల్ కేవలం 20 కిలోమీటర్ల దూరమని అటవీప్రాంతం కావడంతో రవాణా సాధ్యం కాదన్నారు. కొడగు సరిహద్దు దాటి దక్షిణకన్నడ జిల్లా సుళ్యద్వారా ఇక్కడికి చేరుకున్నామన్నారు. కొడగు జిల్లాలో అత్యంతదూరంగా ఉండే రెండు పోలింగ్ కేంద్రాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీజేపీ అభ్యర్థి సుధాకర్ సన్నిహితుడి ఇంటిపై దాడి

● రూ.4.8 కోట్ల స్వాధీనం

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ సన్నిహితుడి నివాసంపై ఎన్నికల అధికారులు దాడులు చేశారు. నెలమంగలలోని సుధాకర్ ఆప్తుడు మాదావర గోవిందప్ప నివాసంపై ఎన్నికల పరిశీలకులు మౌనేశ్ మగ్దుంతోపాటు ఐటీ అధికారులు గురువారం రాత్రి దాడి చేశారు. ఇంట్లో రూ.4.8 కోట్ల నగదుతోపాటు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల పరిశీలకులు మౌనేశ్ మగ్దుం తెలిపిన మేరకు నెలమంగలలోని గోవిందప్ప ఇంట్లో భారీగా నగదు ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈమేరకు 10మంది సిబ్బందితోపాటు ఐటీ, ఎన్నికల అధికారులు సంయుక్తంగా దాడి చేశామన్నారు. నగదును లెక్కించేందుకు మిషన్లను, బంగారం తూకం వేసేందుకు స్కేళ్లను అధికారులు తీసుకొచ్చారు. కాగా బెంగళూరు గ్రామీణ అభ్యర్థి డీకే సురేశ్ ఆప్తుడైన బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ గంగాధర్ నివాసంపైనా దాడి చేశారు. కోణనకుంటె క్రాస్‌లోని గంగాధర్ నివాసంపై దాడి చేయగా రూ.87 లక్షల నగదు, బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.


నెలమంగలలోని గోవిందప్ప నివాసం

ఏం జరిగిందో..!

● స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ ● అధికార పార్టీ నాయకుడి ఒత్తిడే కారణమా?



రాప్తాడు, ఏప్రిల్ 26: ఎన్నికల్లో వైసీపీ ఓట్లు చీల్చే స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను అధికార పార్టీ ఒత్తిళ్లతో అధికారులు తిరస్కరించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ స్క్రూటీనీ కార్యక్రమానికి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. అధికారులపై ఒత్తిడి పెట్టి స్వతంత్ర అభ్యర్థులు సానే ఉమారాణి, ప్రకాష్‌రెడ్డి నామినేషన్లు తిరస్కరింపజేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనుముక్కల గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సానే చెన్నారెడ్డి కుమార్తె సానె ఉమారాణి రాప్తాడులో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అంతకుముందే తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఉమారాణి ఇంటికి వెళ్లి నామినేషన్ వేయద్దని చెప్పాడు. మాకు మీరు ఏం చేశారని పోటీకి దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె రాజశేఖర్‌రెడ్డిని నిలదీసినట్లు సమాచారం. ఉమారాణి పోటీలో ఉంటే చెన్నేకొత్తపల్లి మండలంలో కొన్ని వైసీపీ ఓట్లు చీలే అవకాశం ఉంది. అందువలన తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆ నామినేషన్ తిరస్కరింపచేశారని అనుమానం వ్యక్తమవుతోంది. రాప్తాడు మండలం లింగనపల్లి గ్రామానికి చెందిన కె. ప్రకాష్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేరు కూడా ప్రకాష్‌రెడ్డే. ప్రకాష్‌రెడ్డి పేరు గల స్వతంత్ర అభ్యర్థి పోటీలో ఉంటే పేరు వలన కొన్ని వైసీపీ ఓట్లు చీలే అవకాశం ఉందని ఆ నామినేషన్‌ను కూడా తిరస్కరింప చేసినట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. అలాగే బోగినేపల్లి గ్రామానికి చెందిన శ్రీరెడ్డి సునీతమ్మతో వైసీపీ నాయకులు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. టీడీపీ అభ్యర్థి పేరు పరిటాల సునీత కావడంతో, స్వతంత్ర అభ్యర్థి శ్రీరెడ్డి సునీతమ్మ పోటీలో ఉంటే పేరు తికమకతో కొన్ని టీడీపీ ఓట్లు చీలే అవకాశం ఉందని భావించి పోటీలో నిలిపినట్లు తెలిసింది. అయితే శ్రీరెడ్డి సునీతమ్మ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు ఏదో కారణంలో తిరస్కరించారు. నామినేషన్లు తిరస్కరణకు గల కారణాలు రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలపలేదు.

రాయల వేసవి రాజధాని

● నాడు ఫ్యాక్షన్ ముద్ర.. నేడు ప్రగతి జాడ ● దక్షిణ కొరియా పెట్టుబడుల వరద ● ప్రపంచ కార్ల దిగ్గజం కియ రాకతో పూర్వ వైభవం ● పారిశ్రామిక హబ్‌గా కొత్త అధ్యాయం ● భూముల ధరలకు రెక్కలు ● కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు ● చెరువులకు జలసిరి.. వ్యవసాయానికి పునరుజ్జీవం

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల పేరు చెప్పగానే పెనుకొండ గుర్తుకొస్తుంది. విజయనగర రాజుల రెం డో రాజధానిగా విలసిల్లిన పెనుకొండ చరిత్ర ఘనమై నది. రాయల రాజ్యంలో ఇక్కడ వజ్ర వైఢూర్యాల రాసులతో క ళకళలాడినట్లు చరిత్ర చెబుతోంది. శిల్పకళా క్షేత్రాలు, కోట గోడలు, ఆల యాలతో పాటు బాబయ్యదర్గా, గగనమహల్, జైనదేవాలయం, కొండపై ఖిల్లా, శ్రీకైలాసం లాంటి ఎన్నో విశిష్టతలు కలిగి ఉంది. భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన పోరాట యోధులకు జన్మనిచ్చిన గడ్డ ఇది. తర్వాత రాజకీయ చిత్రపటంలో పెనుకొండ ఫ్యాక్షన్ రాజకీయాలకు కేంద్ర బిందువయింది. చివరిలో గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో 'కియ' కార్ల పరిశ్రమ రావడంతో పెనుకొండ ఘనత మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. పారిశ్రామీకరణతో పెనుకొండ రూపురేఖలే మారిపోయి పూర్వ వైభవం వచ్చింది.

హిందూపురం/పెనుకొండ ఏప్రిల్ 26 : విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయలు ఏలిన గడ్డ పెనుకొండ. నాడు వజ్ర వైఢూర్యాల రాసులతో పాటు కళలు, కళాఖండాలతో కళకళలాడిన పెనుకొండ ఆనవాళ్లు నేటికి చెక్కుచెదరలేదు. రాయలవారి రెండో రాజధాని, వేసవి విడిది పెనుకొండ. ఇలాంటి గడ్డపై మూడు దశాబ్దాల పాటు రాజకీయ ఆధిపత్యం కోసం ఫ్యాక్షన్, వర్గ కక్షలతో రతనాలసీమలో రక్తం ఏరులైపారింది. ఒకనాడు ఫ్యాక్షన్ రాజకీయాలకు పెట్టింది పేరు. నేడు పారిశ్రామిక, పర్యాటక హబ్‌గా మారి ప్రశాంత వాతావరణంలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ప్రముఖ దక్షిణ కొరియా కార్ల పరిశ్రమ కియ రాకతో ప్రపంచ పటంలో గుర్తింపు పొందుతోంది. విదేశీ, స్వదేశీ సంస్కృతులను కలబోసుకుని అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. ఓ వైపు పారిశ్రామిక అభివృద్ధి మరోవైపు వ్యవసాయ ప్రమాణాలను పెంచుతూ ముందుకు దూసుకుపోతుంది. కరువు కటాకాలకు అల్లాడి వలసలు వెళ్లిన వారు సైతం కృష్ణమ్మ పరవళ్లతో వెనుదిరిగి వస్తున్నారు. 1952 మొదటి సారిగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థి వెంగళమ్మ చెరువు లక్ష్మీనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లు 265, మొత్తం ఓటర్లు 2,33,687 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,17,311, మహిళలు 1,16,372, ఇతరులు 3 ఉన్నారు. నియోజకవర్గం 3,49,593.27ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది.

● హంద్రీనీవాలో భాగంగా 2016లో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. అదే ఏడాది డిసెంబరు నెలలో కృష్ణా జలాలను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేశారు. దీంతో పాటు కియ కార్ల పరిశ్రమ పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లి, యర్రమంచి వద్ద ఏర్పాటైంది. ఈ పరిశ్రమకు అనుబంధంగా పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల ప్రాంతాల్లో మరో 20 పరిశ్రమలు రావడంతో వేలకోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చి పడ్డాయి. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న భూములపై కియ ప్రభావం పడడంతో లక్షలు పలికే భూములు కోట్లలోకి చేరాయి. ఫలితంగా ఆకాశాన్ని తాకే మూడు, ఐదు అంతస్థుల భవనాల నిర్మాణాలతో పెనుకొండలో కియ కార్ల పరిశ్రమతో దక్షిణ కొరియా దేశస్తులు రాక సంఖ్య పెరిగింది. ప్రజల ఆర్థిక జీవనవిధానంలో పెనుమార్పులు వచ్చాయి.

2015లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాసెన్, బెల్, ఎయిర్‌బస్‌లు పాలసముద్రం వద్ద ఏర్పాట్లకు ముందుకొచ్చాయి. 2016లో రూ.13వేల కోట్లతో పెనుకొండ వద్ద కియ కార్ల, అనుబంధ పరిశ్రమలు, హంద్రీనీవా ప్రాజెక్ట్, గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. హంద్రీనీవాతో చెరువులకు నీటి రాకతో చెరువులకు జలసిరి వచ్చి కరువు నేలలో పసిడి పంటలు పండుతున్నాయి. నీరు రావడంతో పెనుకొండ వైపు ప్రపంచ దేశాల పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు కోసం పెట్టుబడులకు తొంగి చూస్తున్నాయి.
నియోజకవర్గంలో గోరంట్ల మినహా నాలుగు మండలాలకు హంద్రీనీవా మడకశిర ఉప కాలువ అనుసంధానంగా ఉంది. అయినా ప్రధానంగా చెరువులన్నింటికి నీరు నింపకపోవడంతో సాగు, తాగు నీరు సమస్య ఉంది. ప్రధానంగా గోరంట్ల, పరిగి, రొద్దంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. నియోజక వర్గంలో వర్షాధార పంటలపైనే రైతాంగం ఆ ధారపడి జీవనం సాగిస్తున్నారు. రెండు ద శాబ్దాలుగా చెరువులకు నీరులేక రైతులు, కూలీలు వసలు వెళ్లారు. గోరంట్ల మండలానికి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు ఇవ్వాలన్న ప్రతిపాదన దశలోనే ఉంది. పెనుకొండను ప్రపంచ పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని 2010 నుంచే శ్రీకృష్ణదేవరాయలు ఉత్సవాలు అంత్యంత వైభవంగా నిర్వహించారు. నేటికీ ఇచ్చిన హామీలను పాలకులు పూర్తి చేయలేక పర్యాటకులను ఆకర్షించలేకపోతోంది. పెనుకొండ వద్ద రైల్వే ఫ్లైఓవర్, లేక అండర్‌బ్రిడ్జ్ నిర్మాణం, గోరంట్ల, సోమందేపల్లిలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేవు. చేనేతలకు ఆదరణ కరువై పవర్‌లూమ్స్ వైపు మళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిశ్రమలు వచ్చినా నిరుద్యోగ సమస్యకు మాత్రం చెక్‌పడలేదు.

● తెలుగుదేశం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఉమ్మడి అనంత జిల్లాను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కియా పరిశ్రమను పెనుకొండకు తీసుకొచ్చారు. దీంతో పెనుకొండ పేరును ప్రపంచ పటంలో కియా నిలిపిందనడంలో సందేహం లేదు. 2016లో రూ.13వేల కోట్లతో కియా పరిశ్రమను స్థాపించారు. అప్పట్లో చంద్రబాబు తీసుకున్న నిర్ణయం, ఆయన మీదున్న నమ్మకంతో కియా పరిశ్రమ యజమాని ఇక్కడ పరిశ్రమ పెట్టడానికి ముందుకొచ్చారు. ఒప్పందం ప్రకారం భూమిని ఇవ్వడంతోపాటు నీటిని అందించడం మౌళిక సదుపాయాలు ప్రభుత్వం నుంచి అనుమతులను వేగవంతం చేయించారు. చెప్పిన సమయానికంటే ముందుగానే వారికి అప్పగించడంతో శరవేగంగా కియా పరిశ్రమ ప్రారంభమైంది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాసెన్, బెల్, ఎయిర్‌బస్ సంస్థలు కూడా పెనుకొండ నియోజకవర్గానికి తరలివచ్చాయి. దీంతోపాటు కియా అనుబంధ పరిశ్రమలు కూడా ఇక్కడ కొన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమ రాకతో ఎకరా భూమి వేలల్లో ఉండగా ప్రస్తుతం కోట్లకు చేరింది. దీనివల్ల ఈ ప్రాంతంలోని జీవన ప్రమాణాలు, స్థితిగతులు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి కల్పించింది. దీనివల్ల పెనుకొండ నియోజకవర్గ రూపురేఖలు మారాయని చెప్పవచ్చు.



కియ పరిశ్రమ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

మేరీ ఊల్‌స్టన్‌క్రాఫ్ట్ (జయంతి)



మేరీ ఊల్‌స్టన్‌క్రాఫ్ట్ 1759 ఏప్రిల్ 27న లండన్‌లోని స్పిటాఫీల్డ్స్‌లో జన్మించారు. ఆంగ్ల రచయిత, తత్వవేత్త, న్యాయవాదిగా మహిళా హక్కులకోసం శ్రమించారు. పలు నవలలు, ఇతర రచనలు చేశారు. 'ఏ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమన్' అనే రచన ఎంతో పేరొందింది. 38వ యేట 1797 సెప్టెంబరు 10న కన్నుమూశారు. కాగా అసంపూర్ణ రచనలను ఆమె కుమార్తె మేరీ షెల్లీ పూర్తి చేయడం విశేషం.

జొహ్రా సెహగల్ (జయంతి)




ఆరు దశాబ్దాలకుపైగా నటి, నృత్యకారిణి, కొరియోగ్రాఫర్‌గా రాణించిన 'పద్మ విభూషణ్' గ్రహీత జొహ్రా ముంతాజ్ సెహగల్ 1912 ఏప్రిల్ 27న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం సహారన్‌పూర్‌లో జన్మించారు. బాలీవుడ్, బుల్లితెరపైతోపాటు బ్రిటీష్ సినిమాలలోనూ నటించారు. పృథ్వీరాజ్ కపూర్, అశోక్ కుమార్, దేవ్ ఆనంద్, గోవిందా, షారుఖ్‌ఖాన్, సల్మాన్ ఖాన్, అమితాబ్ బచ్చన్, రణబీర్ ఇలా అన్నితరం నటులతో నటించారు. 'పద్మశ్రీ', 'కాళిదాస్ సమ్మాన్', తదితర పురస్కారాలు పొందారు. 102వ యేట 2014 జూలై 10న కన్నుమూశారు.

హాండెల్ మాన్యుయెల్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత హాండెల్ మాన్యుయెల్ 1918 ఏప్రిల్ 27న తమిళనాడు రాష్ట్రం ట్యుటికోరిన్ (తూతుకూడి)లో జన్మించారు. 23వ యేట మద్రాస్ మ్యూజికల్ అసోసియేషన్‌లో నిర్వాహకులుగా వ్యవహరించారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు పియానిస్ట్, ఆర్గానిస్ట్, స్వర కర్తగా రాణించారు. పాశ్చాత్య శాస్త్రీయ సంగీతాన్ని ప్రాచుర్యం పొందేందుకు కృషి చేశారు. లండన్‌లోని రాయల్ స్కూల్ ఆఫ్ చర్చ్ మ్యూజిక్ శాశ్వత సభ్యత్వం కలిగారు. 1994 అక్టోబరు 22న కన్నుమూశారు.

విశ్వేశతీర్థ స్వామిజీ (జయంతి)



కర్ణాటక రాష్ట్రంలోని ఉడుపి పెజావర పీఠాధిపతిగా సుదీర్ఘ కాలం కొనసాగిన విశ్వేశతీర్థ స్వామిజీ 1931 ఏప్రిల్ 27న దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు తాలూకా రామకుంజలో జన్మించారు. ఆయన పూర్వ నామం వెంకటరామ, ఏడవ యేటనే సన్యాసం తీసుకుని హిందూ ఆధ్యాత్మిక గురువుగా రాణించారు. ఉడుపిలోని అష్టమఠాలలో ఒకటైన పెజావర అధోక్షజ మఠానికి 32వ అధిపతిగా కొనసాగారు. మధ్వాచార్యులు ప్రతిపాదించిన ద్వైత సిద్ధాంతాన్ని అనుసరించారు. పూర్ణప్రజ్ఞ విద్యాపీఠను స్థాపించి వేద అధ్యయనాన్ని ప్రోత్సహించారు. అంతేకాక సమాజ ఉద్ధరణకు ఎంతో కృషి చేశారు. 'యతికుల చక్రవర్తి' గౌరవం అందుకున్నారు. 2019 డిసెంబరు 29న కన్నుమూశారు. మరణానంతరం 2020లో 'పద్మవిభూషణ్' ప్రకటించారు.

కదలివచ్చిన పల్లె జనం..

- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- నాలుగైదు గ్రామాల్లో ప్రజల నిరసనలు

బెంగళూరు, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొన్నిగ్రామాల్లో మౌలిక సదుపాయాలకోసం గ్రామస్థులు నిరసన వ్యక్తం చేయగా మరికొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

బంగారపేట తాలూకాలో 76.96 శాతం పోలింగ్

బంగారపేట: కోలారు పరిధిలోని బంగార పేట శాసనసభ నియోజకవర్గ ంలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించినా వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్ట డంతో పోలింగ్ సజావుగా సాగింది. 76.96శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా యువత, మహిళలు పోలింగ్ కేంద్రాలకు ఉత్సాంగా తరలివచ్చి ఓటు వేశారు. మధ్యాహ్నం వేళ కొంత మంద కొడిగా సాగినా కొన్ని చోట్ల 6.30వరకు పోలింగ్ కొనసాగింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రజలు ఉత్సాహంగా ఓటు వేశారు. ఈసారి 5చోట్ల సఖి పోలింగ్‌బూత్‌లు ఏర్పా టు చేయడం విశేషం. తాలూకాలోని అటవీప్రాంతాలకు అనుబంధంగా ఉండే దోణమడగు, కెదరినత్త గ్రామాల్లో పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామపెద్దల జోక్యంతో నిరసన వీడి పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీల కారణంగా కోలారులో విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కేవీ గౌతమ్ 20వేల మెజారిటీతో గెలుపొందారన్న విశ్వాసం వ్యక్తం చేశారు.



బంగారపేటలో క్యూలో ఓటర్లు

శిడ్లఘట్ట తాలూకాలో 81.04 శాతం..

శిడ్లఘట్ట: చిక్కబళ్ళాపుర లోక్‌సభ పరిధిలోని శిడ్లఘట్ట శాసనసభ నియోజకర్గంలో శుక్రవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 244 పోలింగ్ కేంద్రాలలో చిన్నాచితకా సమస్యలు మినహా 81.04 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం కొంత మేర తగ్గుముఖం పట్టినా ఎండలు తగ్గాక తిరిగి పుంజుకుంది. కొన్ని చోట్ల ఎండను సైతం లెక్కించక వేచియుండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ సొంత గ్రామం మేలూరులో ఓటు వేశారు. మాజీ మంత్రి వీ మునియప్ప హండిగనాళలో ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ స్వగ్రామం ముదుకదహళ్ళిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు, ఏబీటీ గ్రూప్ అధ్యక్షుడు రాజీవ్‌గౌడ, భార్య బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సహనా పట్టణంలోని ఒకటో వార్డులో ఓటు వేశారు. ఇక బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ, బీజేపీ రూరల్ అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ 21వ వార్డులో ఓటు వేశారు. కాంగ్రెస్‌నేత, ఎస్ఎన్ ట్రస్టు ముఖ్యులు పుట్టు ఆంజినప్ప తన స్వగ్రామం మారహళ్ళిలో ఓటు వేశారు. మొత్తమ్మీద శాసనసభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.



చింతామణిలో ఎండలో సైతం వేచియున్న ప్రజలు

ఉత్సాహంగా పోలింగ్

మహదేవపుర: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బెంగళూరు సెంట్రల్ పరిధిలోని మహదేవపుర శాసనసభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ఉత్సాహంగా సాగింది. స్వాభిమాని పక్ష నుంచి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి కే మంజునాథ్ వర్తూరులోని పీయూ కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక సీవీరామన్ నగర్ పరిధిలోని జీవన్‌భీమానగర్‌లోని నేషనల్‌సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, భర్త మాజీ మంత్రి అరవింద లింబావళి పిల్లలతో కలసి ఓటు వేశారు. అనంతరం మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ దేశ అభివృద్ధి దృష్ట్యా మోదీని మళ్లీ ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు.

చింతామణి తాలూకాలో ప్రశాంతంగా...

చింతామణి: కోలారు రిజర్వు లోక్‌సభ నియోజక వర్గ పరిధిలోని చింతామణి శాసనసభ నియోజక వర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాగతి, కేఎస్ఆర్టీసీ బస్టాండ్ పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడం మినహా మరే అంతరాయం లేదు. పట్టణంలోని 31 వార్డులలోనూ పోలింగ్ సజావుగా సాగింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పట్టణంలోని మాళపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే జేకే కృష్ణారెడ్డి, బీజేపీ నాయకుడు వేణుగోపాల్ తదితరులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 271 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేయగా తగిన బందోబస్తు కల్పించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంపై అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



మేలూరులో ఓటు వేసిన ఎమ్మెల్యే రవికుమార్



మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ దంపతులు



కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ దంపతులు



సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప



ఎమ్మెల్యే మంజుళా లింబావళి కుటుంబం



స్వతంత్ర అభ్యర్థి మంజునాథ్

సందడిగా ద్యావప్ప జాతర

శిడ్లఘట్ట, ఏప్రిల్ 26: తాలూకాలోని దిబ్బూరహళ్ళిరోడ్డులోని జయంతి గ్రామంలో ద్యావప్ప గుడి ఆలయంలో 11 రోజుల జాతర సందడి సాగుతోంది. ప్రత్యేకించి పరుషలో చుట్టుపక్కల గ్రామాలనుంచి ఎద్దులు, గొర్రెలు పాల్గొన్నాయి. గోరక్షణ పశువుల పెంపకానికి ద్యావప్ప ప్రాధాన్యత ఇచ్చేవారని, అలాగే పెద్దలంటే గౌరవాభిమానాలు చూపేవారని గ్రామస్థులు అంటారు. వందేళ్లకుపైగా ఇక్కడి జాతరలో ఏటా పరుష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా యోగి పుంగవుడైన ద్యావప్ప జీవ సమాధి అయినా ఇక్కడికి ఏదైనా రోగంతో బాధపడే పశువులను తీసుకొస్తే తప్పక నయమవుతుందనే విశ్వాసం ఉంది. ఈ నేపథ్యంలో జాతరలో భాగంగా ద్యావయ్యకు ప్రతిరోజూ విశేషపూజలు నిర్వహిస్తుంటారు. పరుషలో రూ.50 వేలనుంచి ఐదారు లక్షల విలువైన పశువుల విక్రయాలు సాగుతాయి. కాగా జాతరలో కొనుగోలు చేస్తే తమకు మరింత బలం చేకూరుతుందని రైతుల విశ్వాసంగా ఉంది.



ద్యావప్పకు విశేష అలంకరణ



పరుషలో పశువులు

కార్మికులను ముంచిన జగన్

- వైసీపీ ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాలు రద్దు
- కొన్ని డీఆర్‌డీఏలో విలీనం
- భవన నిర్మాణ కార్మికులకు మొండిచేయి
- గత పాలనే భేష్ అంటున్న బాధితులు

ధర్మవరం : ప్రతిపక్ష నేతగా తమను నమ్మించి అధికారంలోకి వచ్చాక మోసం చేశాడని సీఎం జగన్‌పై భవన నిర్మాణ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచాడని మండిపడుతున్నారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేసిందని గుర్తు చేసుకుంటున్నారు.

● చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన పలు కార్మిక సంక్షేమ పథకాలను అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఐదారేళ్ల కిందట వివిధపథకాల కోసం వచ్చే కార్మికులతో కళకళలాడిన కార్మికశాఖ కార్యాలయం నేడు వెలవెలబోయింది. జగన్ ఆడిన ఓట్లాటలో అసంఘటిత కార్మికులు ఓడిపోయారని కార్మికసంఘాలు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వృత్తి పనిముట్లు ఇస్తే...వైసీపీ ప్రభుత్వం వాటిని ఆపేశారని తాపీ మేస్త్రీలు ఆక్రోశిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు దాదాపు లక్షకుపైగా ఉన్నారు. వీరికి గత టీడీపీ ప్రభుత్వంలో పలు పథకాలు అమలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సగం పథకాలను రద్దు చేసింది. కొన్నింటిని కార్మికశాఖ నుంచి తొలగించి, గ్రామీణుల కోసం డీఆర్‌డీఏ అమలు చేస్తున్న పథకాలే కార్మికులకు కూడా వర్తిస్తాయని, ప్రత్యేకంగా కార్మిక శాఖ పర్యవేక్షణలో అమలు చేయకుండా ఆపేసింది.

● భవన, ఇతర రంగాల్లో పనిచేసే సంఘటిత, అసంఘటిత కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి టీడీపీ ప్రభుత్వం ప్రోత్సహించింది. శిక్షణకాలంలో ప్రతి రోజూ రూ.300 స్టయిఫండ్ ఇచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక నైపుణ్య శిక్షణ ఎత్తేశారు.

● నిర్మాణరంగంలోని తాపీమేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అవసరమైన వృత్తి పనిముట్ల కోసం అప్పుల చేయాల్సిన ఉండేది. చంద్రబాబునాయుడు వారి ఆర్థిక ఇబ్బందులు గుర్తించి నాణ్యమైన వృత్తి పనిముట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కొక్క కార్మికుడికి సగటున రూ.25వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చుచేశారని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నా రు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక వృత్తి పనిముట్ల పంపిణీ పథకాన్ని రద్దుచేశారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కార్మికశాఖను నిర్వీర్యం చేసిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇళ్ల నిర్మాణం చేపడుతున్న భవన నిర్మాణ కార్మికులు

డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లాల్సిందే

కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ఎవరైనా 18 ఏళ్ల పైబడిన తమ కూతురికి పెళ్లి చేయాలంటే చంద్రన్న పెళ్లికానుక కోసం కార్మికశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకునేవారు. అలాగే ఏదైనా ప్రమాదంలో మరణించిన, గాయపడినా చంద్రన్న బీమా కోసం కార్మిక శాఖ కార్యాలయం తలుపులు తట్టేవారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.5లక్షలు ఇచ్చేవారు. సాధారణ మరణం అయితే రూ.60వేలు ఆర్థిక సాయం ఉండేది. గుర్తింపు కార్డులేని కార్మికులు మరణించినా కూడా రూ.50వేలు వచ్చేవి. చదువుకునే పిల్లలు ఉంటే స్కాలర్‌షిప్‌లు అందజేసేవారు. ఇవే పథకాలు డీఆర్‌డీఏ అమలు చేస్తుందని అక్కడ ఇక్కడా రెండు చోట్ల కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందని వైసీపీ ప్రభుత్వం సరికొత్త వాదనకు తెరతీసింది. సంక్షేమ పథకాలకు డీఆర్‌డీఏకి దరఖాస్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంటే దాదాపు 11 సంక్షేమపథకాలు కార్మిక శాఖ పరిధి నుంచి తీసేసింది. కేంద్రం అమలు చేస్తున్న ఈ శ్రమ్ తప్ప రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఏ ఒక్క పథకం కూడా కార్మికశాఖ ప్రస్తుతం అమలు చేయడం లేదు.

దుడ్లకు ఓటేస్తే అభివృద్ధి చేస్తారా?

దుడ్లు తీసుకుని ఓట్లేస్తే.. లెక్కిచ్చినోళ్లు ఇంగ గ్రామాన్ని ఏంటికి అభివృద్ధి చేస్తారు. నాకు ఓటు హక్కు వచ్చినప్పుడు మా ఊర్లో అందరూ ఒక చోట సమావేశమై ఎవరికి ఓటు వేయాలనే దానిపై చర్చించేవారు. ఫలానా వ్యక్తికి ఓటేస్తే గ్రామంలో మంచి పనులు చేస్తాడని అందరూ కూడబలుక్కుని అతడికే ఓటేసేవారు. ఇప్పుడు అన్నింటికి దుడ్లే ప్రామాణికం అయ్యాయి. గెలిచిన తరువాత గ్రామంలో పనులు చేయాలని నాయకుడిని నిలదీసే పరిస్థితి లేకుండాపోయింది. ఒకవేళ ఎవరైనా పనులు చేయమని గట్టిగా అడిగితే మీరేమైనా ఉద్దరగా ఓట్లేశారా? దుడ్లు తీసుకున్నారు కదా..! గమ్మున ఉండండి అని ముఖం మీదే చెబుతున్నారు. అప్పట్లో సమస్యలు చెప్పిన వెంటనే పరిష్కారానికి కృషి చేసేవారు. అందుకే యువకులు ఓటు విలువ తెలుసుకుని దేశాభివృద్ధికి దాన్ని వినియోగించాలి. - శింగనమల

టోల్‌ఫ్రీ నంబర్ 1950 ఎందుకంటే..!

రాయదుర్గం, ఏప్రిల్ 26 : కేంద్ర ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 అమలులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఈ నెంబరుతో అన్ని జిల్లాల్లోను కాల్ సెంటర్లను ప్రారంభించింది. ముఖ్యంగా 1950నే ఎందుకు ప్రవేశపెట్టిందనే విషయం వెనుక ప్రత్యేకత దాగి ఉంది. దేశంలో ఎన్నికల సంఘం 1950లో ఏర్పడింది. అప్పటి నుంచి సార్వత్రిక, స్థానిక సంస్థలు సహా పలు రకాల ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషన్‌ను ప్రారంభించిన సంవత్సరానికి గుర్తుగా ప్రజలు మరువకుండా ఉండేలా ఈ నెంబరును దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

లెక్క వచ్చిందోచ్..!



యల్లనూరు, ఏప్రిల్26: ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేయడానికి వైసీపీ అభ్యర్థి నుంచి మండలంలోని రెండు గ్రామాల నాయకుల వద్దకు సొమ్ము వచ్చిందనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. నమ్మకం ఉన్న నాయకుల వద్ద ఈ డబ్బు డంప్ చేశారని సమాచారం. పోలింగ్‌కు రెండురోజులకు ముందు రెండుగ్రామాల నుంచి మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తారని తెలిసింది. ఈ విషయం గురించి మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

ఏ ముఖంతో ఓట్లు అడుగుతాడో..!

గ్రామానికి రోడ్డు వేసిన తర్వాతే ఓట్లు అడుగుతామని వైసీపీకి చెందిన యువనేత హామీ ఇచ్చి ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. 2019లో తెలుగుదేశం హయాంలో ఉరవ కొండ నుంచి ఇంద్రావతివరకూ ఏడు కిలోమీటర్ల రోడ్డు వేయడానికి రూ.3.54 కోట్ల నిధులు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరయ్యాయి. అప్పట్లో సాంకేతిక సమస్యల వలన పనులు ప్రారంభించలేదు. గత ఏడాది ఆగస్టులో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాతనే ఓట్లు అడుగుతామని హామీ ఇచ్చారు. కానీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. రహదారి అధ్వానంగా ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి ఇప్పుడు ఎన్నికల సీజన్ కాబట్టి ఏముఖం పెట్టుకుని ఆ యువనేత ఓట్లు అడుగుతాడోనని ఆ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.

- ఉరవకొండ



ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు






ఓటు వేసిన వారికి ఉచిత అల్పాహారం



చిత్రదుర్గ జిల్లా కురబరహట్టి పోలింగ్ కేంద్రంలో ఓటేసిన స్వామీజీలు



నిరసనలో బాగేపల్లి తాలూకా గూళూరు హోబళి దేవికుంటె గ్రామస్థులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.41	1,576.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	65	252
సామర్థ్యం (టీఎంసీలు)	3.75	2.90

సార్! ప్లీజ్

- సభకు వచ్చి వెళ్లండి
- ఉత్కంఠ మధ్య సాగిన రాహుల్ పర్యటన
- బతిమిలాడుకోవడంతో మెత్తబడిన నేత



రాహుల్‌కు ఎయిర్ పోర్టులో స్వాగతం పలుకుతున్న నేతలు

బళ్లారి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి కాంగ్రెస్ నాయకులపై రాహుల్ అలిగారా? లేకుంటే బళ్లారి రాకుండానే జిందాల్ ఎయిర్ పోర్టు వరకూ వచ్చి బళ్లారిలో సభకు రాకుండా ఎందుకు వెళ్లిపోతున్నారు? సభకు జనం రాలేదనా....? లేదా కలబురిగిలో జరిగే సభకు ఆలస్యం అవుతుందనా..? ఇలా అనేక అనుమానాలు మధ్య రాహుల్ గాంధీ బళ్లారి సభకు హజరై హమ్మయ్యా! అనిపించారు. వాస్తవానికి ఏమి జరిగిందంటే.. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం బళ్లారిలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ముందుగా రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి, దక్షిణ కర్ణాటకలో ఉండే ఎంపీ అభ్యర్థులు ఇలా కాంగ్రెస్ ప్రముఖులంతా హజరవుతారని ప్రచారం చేశారు. ప్రకటనలూ ఇచ్చుకున్నారు.

అనుకున్న సమయం శుక్రవారం వచ్చే వచ్చింది. సాయంత్రం 5 గంటలు దాటిపోయింది. సభలో బళ్లారి లో ఉండే నాయకులే గాని జనం పెద్దగా లేరు. వేసిన కుర్చీలు అన్నీ ఖాళీగానే దర్శనం ఇస్తున్నాయి. ఈ మధ్యలో సభలో కొందరి ద్వారా రాహుల్ గాంధీ రావడం లేదు అనే ప్రచారం సాగింది. ఇంకొందరు మరో అడుగు ముందుకేసి ఏకంగా సోషియల్ మీడియాల్లో బళ్లారికి రాహుల్ రావడం లేదు అని కూడా పోస్టు చేశారు. ఇంతలో బళ్లారి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ రాజ్యసభ సభ్యుడు బీకే హరి ప్రసాద్ రాహుల్‌కు ఫోన్ చేసి 'సార్! బళ్లారి సోనియమ్మ పోటీ చేసిన సెంటర్ జనం మీకోసం ఎదురు చూస్తున్నారు. వచ్చిపోతే బాగుంటుంది. అని రాహుల్‌ను ఫోన్‌లో రిక్వెస్ట్ చేశారు. దీంతో రాహుల్ కాస్త మెత్తబడగా, ఓ ఎస్‌పీజీ పోలీస్ అధికారి ఆయనను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కారులో కాకుండా మరో కారులో బళ్లారి వరకూ తీసుకువచ్చారు. రాహుల్ ప్రసంగం ముగించుకుని చకచకా వెళ్లిపోయారు. ఇంకో విషయం ఏమిటంటే రాహుల్ హడావిడిలో ఎక్కడా ఎంపీ అభ్యర్థి పేరు చెప్పలేదు. ఓటు వేయమని కూడా ప్రజలను అడగలేదు. మోదీని, బీజేపీని తిట్టి వెళ్లిపోయారు. హమ్మయ్య! సార్ వచ్చిపోయారు. పరువు నిలబడిందని కాంగ్రెస్ నాయకులు కొందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఐదు గ్యారెంటీల వల్ల మరింత అభివృద్ధి

బళ్లారిలో ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ హామీ

బళ్లారిరూరల్, ఏప్రిల్ 26 : ఐదు గ్యారెంటీల వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పథకాలు తెస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బళ్లారి నగరం అనంతపురం రోడ్డులో వున్న మున్సిపల్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ సమావేశానికి బళ్లారి నగరంతో పాటు బళ్లారి, రాయచూరు, కొప్పాళ, విజయనగర జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బహిరంగ సభకు హాజరయ్యారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఐదు గ్యారెంటీల వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పథకాలు తెస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వల్లే దేశం అభివృద్ధి చెందిందన్నారు.

ఈ కార్యక్రమానికి బళ్లారి ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిజమీర్ అహ్మద్‌తో పాటు కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ సుజ్జేవాల్, కంప్లి ఎమ్మెల్యే గణేష్, సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి తుకారామ్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓటు వేయడం చట్టబద్ధమైన హక్కు



సెల్ఫీ బూత్‌ను ప్రారంభిస్తున్న సీడీపీఓ నాగరాజు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 26: ఓటు వేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, మే 7న ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలని బాలల అభివృద్ధి పథకం అధికారి నాగరాజు కోరారు. జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో విమ్స్ సర్కిల్ నుంచి ఇందిరానగర్ వరకు నిర్వహించిన పోలింగ్ జాతా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు ఓటు వేసి సరైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. 'నేను పౌర పాటు లేకుండా ఓటు వేస్తాను' అంటూ సెల్ఫీ బూత్‌ను ప్రారంభించారు. జాతా పొడవునా మహిళలు, ఆశాకార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లతో పాటు మహిళలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



ఉప్పరహళ్లి వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కంప్లి, ఏప్రిల్ 26 : కంప్లి తాలుకా పరిధిలోని ఉప్పరహళ్లిలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈదురు గాలులు ఎక్కువగా రావడంతో మామిడి పూత పూర్తిగా ధ్వంసమైంది. ఈ సందర్భంగా జెస్కామ్ అధికారి మాట్లాడుతూ ఈదురుగాలుల వల్ల విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాజు

కంప్లి, ఏప్రిల్ 26 : తాలుకా పరిధిలోని దండబొమ్మనహళ్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను తహసీల్దార్ రాజు ఫిరంగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో గోశాలలు లేక పశువులకు పశుగ్రాసం లేక ప్రజలు ఎంతో ఇబ్బందిపడుతున్నారన్నారు. వారిని దృష్టిలో వుంచుకుని రైతులు ముందుకొచ్చి దండబొమ్మనహళ్లి వద్ద గోశాలను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ప్రభుత్వం ద్వారా గోశాలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే పశుగ్రాసంతో పాటు నీటి తొట్టిలు, షెడ్డు ఏర్పాటుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుండి మంజూరయ్యాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ గోశాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

బళ్లారిరూరల్, ఏప్రిల్ 26 : తాలుకాలోని పీడీ హళ్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగభూషణ్ వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా గుత్తికి చెందిన షెక్షావలీ బళ్లారి నుండి గుత్తికి రూ. 46 వేలు అక్రమ మద్యం ఏపీఎస్ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

కాంగ్రెస్ కార్యకర్తలను ఎవరూ అడ్డుకోలేరు

మంత్రి నాగేంద్ర

బళ్లారి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అడ్డుకోలేరని, కాంగ్రెస్ కార్యకర్తల పార్టీ కోసం ఎంతకైనా దాటి వస్తారని మంత్రి నాగేంద్ర ప్రసంగించారు. గేట్లు తెరుచుకుని, బ్యారీకేట్లు తొలగించుకుని వెనక ఉండే వాళ్లు ముందుకు రావాలని రాహుల్ గాంధీ సభకు వచ్చిన వారిని ఉద్దేశించి మంత్రి నాగేంద్ర ప్రసంగించారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు అనుకున్నంత జనం రాహుల్ సభలో తొలుత కనిపించక పోవడంతో మంత్రి కాస్త ఆందోళనకు లోనయ్యారు. ఆయన వేదిక పై నుండి ఉద్రేక భరితంగానూ. రాహుల్ గాంధీ సభ ప్రారంభంలో జనం లేక తొలిత వేదిక పలచబడింది. తరువాత పుంజుకుంది. ఎండకు జనం ముందుగా ఏర్పాటు చేసిన స్థలంలో వచ్చికూర్చోలేక గొడ చాటున నీడలో చెట్లు కొమ్మల చాటున నిల్చుని సేద తీర్చుకున్నారు. దీన్ని గమనించిన మంత్రి అందరూ వేదిక వద్దకు రావాలని కోరారు. అలాగే ఎక్కడైనా గేట్లు వేసి ఉంటే తెంచుకుని రావాలని బ్యారీకేడ్లు తొలగించుకుని అందరూ ముందుకు రావాలని కోరారు. ముందు వరుసలో వీవీఐపీల కోసం ఏర్పాటు చేసి సీట్లు కూడా ఖాళీగా ఉండడంతో మాకు ఇప్పుడు అందరూ వీవీఐపీలే అందరూ ముందుకు రావాలని మంత్రి పదేపదేకోరడంతో వెనుక వరుసలో ఉండే వాళ్లంతా ముందు వరుసలో ఉండే వీవీఐపీ సీట్లలోకి వచ్చి కూర్చున్నారు. అంతకు ముందు మంత్రి శివరాజ్ తంగడిగే, జమీర్ అమ్మద్, మాజీ మంత్రి పరమేశ్వరనాయక్ మాట్లాడుతుంటే మంత్రి మధ్యలో కలుగుచేసుకుని వెనుక ఉండే జనం ముందుకు రావాలని పదేపదే కోరారు. మొత్తం మీద రాహుల్ వచ్చే సమయానికి వెనుక ఉండే వాళ్లను ముందుకు రప్పించి సభలో జనంఉన్నారు అనిపించారు.



రాహుల్ కోసం ఎదురుచూస్తున్న మంత్రి నాగేంద్ర

రాహుల్ సభ సైడ్‌లైట్స్

- లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బళ్లారిలో పర్యటించారు.
- జిందాల్ ఎయిర్ పోర్టులో రాహుల్‌ను నాయకులు కలిసి సన్మానించారు.
- రాహుల్ జిందాల్ విమానాశ్రయం వరకూ వచ్చి బళ్లారికి రాకుండా తిరిగి వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీకే హరిప్రసాద్, మంత్రి నాగేంద్ర, సంతోష్‌లాడ్ రాహుల్‌కు నచ్చచెప్పి బళ్లారి సభలో పాల్గొనేలా చేశారు.
- రాహుల్ సభకు రాకుండా వెళ్లిపోతున్నారని తొలుత సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.
- అనుకున్న సమయానికి సభ ప్రారంభం కాలేదు. జనం కూడా రాలేదు, వేసిన కుర్చీలు అన్నీ ఖాళీగానే ఉన్నాయి. జనం వస్తారో రారో తెలియక మంత్రి నాగేంద్ర, జమీర్ అమ్మద్, నారా భరత్‌రెడ్డి, సంతోష్ లాడ్, ఇతర కాంగ్రెస్ నాయకులు కాస్త ఆందోళన చెందారు.
- మంత్రి నాగేంద్ర తన చాతుర్యం ప్రదర్శించి జనం రాకుండా బీజేపీ వాళ్లు అడ్డుకుంటున్నారు అని వాస్తవాన్ని మరిపించే ప్రయత్నం చేసినట్లు కనిపించింది.
- వేదికపైన నుంచి మంత్రి నాగేంద్ర వెనుక ఉండే వాళ్లు ముందుకురండి. గేట్లు వేసినా తొలిగించుకునిరండి. కట్టిన బ్యారీకేడ్లు తీసేయండి అని సూచించారు.
- అలాగే పోలీసోళ్లను ఉద్దేశించి 'కార్యకర్తలను అడ్డుకోవద్దండి, పాసులు లేకపోయినా వాళ్లను రానీయండి' అని కోరారు.
- రాహుల్ గాంధీ వచ్చే సమయానికి వీవీఐపీలకు వేసిన కుర్చీల్లో అందరూ కూర్చున్నారు.
- ముందు వరుసలో ఉండే వారు ఎక్కడ ఏమి విసురుతారోనని ఎస్‌పీజీ పోలీసులతో పాటు రక్షణ పోలీసులు సివిల్ పోలీసులు కొంత ఆందోళన చెందారు.
- వెనుక ఉండే జనాన్ని ముందుకు రప్పించేందుకు స్వయానా ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఇతర నాయకులు జనం మధ్యలోకి వెళ్లారు.
- గ్రామీణ ప్రాంతాల్లో నుండి జనం ఓకే. కానీ బళ్లారి నగరం నుంచి వచ్చిన జనం తక్కువ అని నాయకులు చర్చించుకోవడం వినిపించింది. స్వయానా ఎంపీ అభ్యర్థి తుకారాం మాజీ ఎమ్మెల్సీ అల్లం వీరభద్రప్పతో నాయకుల మధ్య బేధాభిప్రాయాలు కారణంగా జనం రాలేక పోయారని వ్యాఖ్యానించినట్లు సమాచారం.
- రాహుల్ గాంధీ జిందాల్ ఏయిర్ పోర్ట్ నుంచి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి కారులో వచ్చారు. ఆయన డ్రైవర్ కాకుండా ఎస్‌పీజీ పోలీస్ అధికారి డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చారు.
- న్యూస్ కవరేజీకి వెళ్లిన మీడియా కూడా చాలా ఇబ్బంది పడింది. మీడియా కు వేసిన కుర్చీల్లో వేరే వారు కూర్చోవడం, అలాగే ముందు వరుసలో కార్యకర్తలు నిల్చుని సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసుకోవడంతో ఎలెక్ట్రానిక్, ప్రింట్ మీడియా ఇబ్బంది పడింది.
- మంత్రులు పదేపదే వెనుక ఉండే వాళ్లను ముందుకు రావాలని రెచ్చగొట్టడం, కట్టిన బ్యారీకేడ్లను తొలగించడం కారణంగా ముందుకు వచ్చిన వాళ్లు రాహుల్ గాంధీని ఎక్కడ ఇబ్బంది పెడతారోనని పోలీసులు ఆందోళన చెందారు. మొత్తం మీద రాహుల్ గాంధీ సభ ఓకే అని అని కొందరు అనుకోవడం వినిపించింది.

వశిష్టలో విద్యార్థులకు ర్యాంకుల పంట



విక్రమ్ సూర్య, చిన్మయి, ఉత్కర్ష, ప్రమోద్, హరిజా, అమోఘ, ప్రద్యుమ్న, క్రిష్ణ కౌశిక్ రెడ్డి, శ్రేయజోషి, బసవరాజ్, సంజిత్ తరిగోపులా

బళ్లారి సిటీ, ఏప్రిల్ 26: జేఈఈ మెయిన్ పరీక్షల్లో బళ్లారి వశిష్ట కళాశాల విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఎం.ఎస్ విక్రమ్ సూర్య 99.89 శాతం, చిన్మయి 99.81 శాతం సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. ఉత్కర్ష 98.48 శాతం ప్రమోద్ 97.67, హర్షిజా 96.22, అమోఘ 94.60, ప్రద్యుమ్న 94.60, క్రిష్ణ కౌశిక్ రెడ్డి 94.27, శ్రేయజోషి 94.02, బసవరాజ్ 93.60, సంజిత్ తరిగోపులా 93.34 శాతం మార్కులు సాధించినట్లు కళాశాల ప్రధాన ఆచార్యులు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన వారిని కళాశాల డైరెక్టర్లు, ప్రభాకర్‌నాయుడు, సురేశ్, సునీల్ తదితరులు అభినందించారు.

జేఈఈలో బెస్ట్ కళాశాల విద్యార్థుల సత్తా



మేధ, ప్రదీప్ పాటిల్, ఎండీ అష్పక్, బసవలీల, గౌరీశంకర్, హర్షగుప్తా, అనిల్‌కుమార్, మధుమతి, శశిధర

బళ్లారి సిటీ, ఏప్రిల్ 26: 2024 జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో బళ్లారి బెస్ట్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కోనంకి రామప్ప, సభ్యులు, ప్రధాన ఆచార్యులు అభినందించారు. హర్షగుప్త 99.61 పర్సంటేజీ సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. అనిల్‌కుమార్ 98.08 , శశిధర్ 96.77, సయ్యద్ మహ్మద్ అష్పక్ 94.01, మదినేని గౌరీ శంకర్ 94.11, బసవలీల 93.41, మేధా 92.62, పదీప్ పాటిల్ 90,87 పర్సంటేజీ సాధించినట్లు కళాశాల ప్రధాన చార్యులు వెంకటేశ్వరావు తెలిపారు.

జేఈఈలో సర్ ఎంవి పీయూ కళాశాల విద్యార్థుల ప్రతిభ



యుఎం.సాగరిక, శ్రేయస్, యశ్వంత్ శ్రేయస్ చిరాగ్ తేజస్విని, ప్రియాంక, కే.విద్యా, ప్రజ్వల్‌కుమార్, వినయ్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 26: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో దావణగేరె సర్.ఎం.వి పీయూ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. మొత్తం 363 మంది జేఈఈలో అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి స్థాయిలో యుఎం.సాగరిక 41వ ర్యాంక్, శ్రేయస్ 99, యశ్వంత్‌కుమార్ 227, శ్రేయస్ శంభులింగ నాగనూర్ 263, చిరాగ్ 310, తేజశ్విని 317, ప్రియాంక 391, కే.విద్యా 690, ప్రజ్వల్ కుమార్ 874,వినయ్ 998, సృజన1261, రోహన్ 1319, మహేశ్‌బాబు 1400, సంతోష్ ప్రద్యుమ్న 1405, శ్రేయస్ 1486, రతన్ ఏ మరోశ్ 1504, అనన్య గౌరిశ్రీ 1566, రెహన్‌నూర్ మహ్మద్ 1592, కార్తిక్ వివమూర్తి బసాపుర 1711, కౌశిక్ 1857, కరణ్ 1860వ ర్యాంకు సాధించారు. రాష్ట్రస్థాయిలో 50లోపు 1వ ర్యాంకు, 100ర్యాంకులలోపు ఇద్దరు ర్యాంకులు సాధించినట్లు పాలక మండలి తెలిపింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ పాలక యంత్రాంగం సిబ్బంది అభినందించారు.

హోసూరు జోన్

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం ఆరంభం



కీరదోస, పెసరపప్పు అందచేస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, ఏప్రిల్ 26: ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేలా హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో హోసూరు బస్ స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. హోసూరు ప్రాంతీయ కార్యదర్శులు వాసుదేవన్ , అశోక్‌రెడ్డి అధ్యక్షత వహించారు. యూనియన్ కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యదర్శి రాము నాయకత్వం వహించారు. పశ్చిమ జిల్లా కార్యదర్శి మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, ఎంజీఆర్ జిల్లా సంయుక్త కార్యదర్శి జై ప్రకాశ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజలకు పుచ్చకాయ, మజ్జిగ, దోసకాయ పంపిణీ చేశారు. కార్యక్రమంల్లో సాహిత్య బృందం జిల్లా కార్యదర్శి యువత సర్కిల్ కార్యదర్శి హేమకుమార్, కార్పొరేషన్ కౌన్సిలర్లు కుబేరన్, దిల్షిత్ రఘుమాన్, శివరామన్, నగర మాజీ కౌన్సిలర్ సరస్వతి నటరాజ్, తవమణి, బాలుస్వామి, సర్కిల్ కార్యదర్శి హరీజ్ కాంతప్పన్, పాల్గొన్నారు.

మారియమ్మ ఆలయంలో కుంభాభిషేకం

హోసూరు ఏప్రిల్ 26 హోసూరు అరసనట్టి అరుళ్‌ముకి శ్రీ మారియమ్మ దేవాలయ మాహా కుంభాభీషేకంలో శుక్రవారం వేలాది మందికి పైగ భక్తాదులు పాల్గొన్నారు. హోసూరు అరసనట్టి ప్రాంతంలో పురాతన మారియమ్మన్ ఆలయం ఉంది, ఈ ఆలయంలోని వందల సంవత్సరానికి క్రితం స్వయంభూగా అవతరించి హోసూరు ప్రాంత ప్రజలను అనుగ్ర హిస్తోంది. ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. సిప్‌కాట్, జూజూవాడీ, హోసూరు ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు, భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అందరికి అన్నదానం ప్రసాదం అందజేశారు, ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ ప్రజలు భారీ ఏర్పాట్లు చేశారు.

పాఠశాల బస్సుల తనిఖీ

హోసూరు(సిప్‌కాట్) ఏప్రిల్ 26 : హోసూరు ప్రాంతీయ రవాణా కార్యాలయంలో పాఠశాల బస్సుల ప్రత్యేక వార్షిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక అధ్యక్షత వహించారు. జిల్లా రవాణా అధికారి హోసూరు దురైస్వామి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హోసూరు బాబుప్రశాంత్ జిల్లా విద్యాశాఖాధికారి రమాదేవి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మణిమారన్ పాల్గొని పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. దీనికి సంబంధించి స్టేషన్ అధికారి రాజా ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రాక్టికల్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది స్కూల్ బస్సు డ్రైవర్లు, బస్ అటెండర్లు, సామాన్య ప్రజలకు అవగాహన కల్పించారు.



పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాధికారులు

మోదీ పాలనలో అన్ని వర్గాలకు నిరాశే



రాయచూరు జిల్లా పోత్నాళ్ గ్రామంలో భారీగా ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

మంత్రి భోసరాజు

రాయచూరు, ఏప్రిల్ 26 : 10 ఏళ్ల పాటు సాగిన నరేంద్రమోదీ పాలనలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు నిరాశే మిగిలిందని రాష్ట్ర చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ భోసరాజు అన్నారు. 2014లో పాలన పగ్గాలు చేపట్టింది మొదలు ఇప్పటి వరకు 10 ఏళ్లుగా అబద్ధాలు చెబుతూ ప్రజలను నరేంద్ర మోదీ వంచిస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లోకసభ అభ్యర్థి జి.కుమార్ నాయక్ తరపున శుక్రవారం జిల్లాలోని మాన్వి తాలూకా పోత్నాళ్ గ్రామ సింధనూరు రోడ్డు పక్కన ఉన్న నాడగౌడ మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో పాల్గొని మంత్రి మాట్లాడారు. 2014లో అప్పటి యూపీఏ ప్రభుత్వం పై అబద్ధాలను అదే పనిగా ప్రచారం చేసిన నరేంద్ర మోదీ గుజరాత్ మోడల్ పేరుతో ప్రజలను పెద్ద ఎత్తున మోసం చేశాడన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను నమ్మించిన మోదీ పాలనలో నిరుద్యోగం దేశంలో తీవ్ర రూపం దాల్చడం వారి పచ్చి అబద్దాలకు నిదర్శనమన్నారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు రప్పించి ప్రతి భారతీయ నిరుపేదల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన మాట ప్రజలను వంచించడమేనన్నారు. అదే సమయంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న పెద్ద మనిషి రైతుల గొంతు నొక్కేందుకు మూడు కొత్త వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతు సంఘాల చేతిలో భంగపడిన విసయం ప్రజలకు తెలిసిందేనన్నారు. మరోసారి అధికారం కోసం 10 ఏళ్లలో చేసిందేమి చెప్పుకునే అవకాశం లేక దేవుడు, మతం, ప్రాంతం, కులం పేరుతో ప్రజలను విభజించి ఓట్లుపొందే ప్రయత్నం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. కుమార్ నాయక్‌కు ప్రజలు పట్టం కట్టాలని అభ్యర్థించారు.